క్లుప్తంగా

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మునిపల్లి(అందోల్): ఇంటర్మీడియట్‌లో ప్రవేశాల కోసం మోడల్ స్కూల్, కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మగ్గంవర్క్‌లో ఉచిత శిక్షణ

సంగారెడ్డి టౌన్: మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ డైరెక్టర్ వంగ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డి, మెదక్ జిల్లాలోని మహిళలకు మే 20 నుంచి నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, శిక్షణతో పాటు ఉచిత వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామని తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల వయసు ఉన్న మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి వారు సంగారెడ్డి బైపాస్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 9490129839, 9704446956 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

రేపటి నుంచి కల్యాణ మహోత్సవాలు

నారాయణఖేడ్: ఖేడ్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో ఈ నెల 17వ తేదీ నుంచి 22 వరకు లక్ష్మీవేంకటేశ్వర కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బాధ్యులు తెలిపారు. మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం భవానీమాతకు బోనాలు, 18న రాజహోమం, లక్ష్మీవెంకటేశ్వర కల్యాణం, బండ్ల ప్రదక్షణ, నల్లపోచమ్మ వీధినాటకం మొదటి భాగం ప్రదర్శన, 19న లాజహోమం, పాచిబండ్ల ప్రదక్షణ, 20న లాజహోమం, రథోత్సవం, వీధినాటం రెండోభాగం ప్రదర్శన, 21న పూర్ణాహుతి, అఖిలాండ కోటి బహ్మాండ నాయకుడి పల్లకీసేవా నగరప్రదర్శన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 22న కుస్తీపోటీలు, వీధినాటకం చివరిభాగం ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని అన్ని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుమ్మడిదల, జిన్నారం, నల్లవల్లి, బొంతపల్లి, కానుకుంట, అన్నారం, గడ్డపోతారం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024- 25 సంవత్సరానికి గాను డిగ్రీ తొలి సంవత్సరంలో చేరే విద్యార్థులు దోస్త్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీ.ఏ, బీకాం, కంప్యూటర్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సీ గ్రూపులో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో 780 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులకు మలబార్ గోల్డ్ స్కాలర్ షిప్ సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి హేయమైన చర్య

సంగారెడ్డి టౌన్: నారాయణఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం హేయమైన చర్య అని ఉపాధ్యాయ సంఘాల నాయకులు అభివర్ణించారు. లాఠీచార్జి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి కలెక్టరేట్‌లో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇతర జిల్లాల మాదిరిగా నారాయణఖేడ్‌లో ఎన్నికల సిబ్బందికి 5 రోజుల రెమ్యూనరేషన్ చెల్లించాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేశాయన్నారు. సమస్యలపై ప్రశ్నిస్తే లాఠీచార్జి చేస్తారా అని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ జన్మదిన సందర్భంగా పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం మదర్ మేరీ వృద్ధాశ్రమంలో ఎంకేవై యువసేన ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. అనంతరం ఆశ్రమ నిర్వాహకులు కార్పొరేటర్‌ను దీవిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



చెత్తాచెదారంతో నిండిపోయిన ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం

ఇష్టానుసారంగా చెత్త పారబోత

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్ పరిధిలోని పలుచోట్ల రోడ్లపై ఇష్టానుసారంగా చెత్తను పడేస్తున్నారు. దీంతో రోడ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం చెత్తాచెదారంతో నిండిపోతుండటంతో వాహనదారులు ముక్కు మూసుకొని వెళ్తున్నారు. చెత్తను తరలించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న స్తంభంపై మరమ్మతులు చేస్తున్న లైన్‌మెన్

ప్రమాదకరంగా కేబుల్ వైర్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రోజురోజుకు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎక్కడ చూసినా స్తంభాలకు కేబులు వైర్ల కట్టలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. దీంతో విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు లైన్‌మ్యాన్‌లు స్తంభాలను ఎక్కాలంటే ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఒక్కోసారి కేబులు వైర్లు తెగి రోడ్లపై వేలాడుతూ వాహనదారులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రాణనష్టం చోటుచేసుకోకుండా అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



తడ్కల్ సమీపంలో మురుగు గుంతలో చేరిన డ్రైనేజీ నీరు

దుర్వాసన మధ్యన ప్రయాణం

కంగ్టి(నారాయణఖేడ్): మండల పరిధిలోని తడ్కల్ గ్రామ సమీపంలో ఉన్న కొత్త కాలనీలోని మురుగునీటిని నల్లవాగు నుంచి తడ్కల్ వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపైకి వదిలారు. దీంతో వాహనదారులు భరించలేని కంపువాసన మధ్యన ముర్కుంజాల్, రాసోల్, బాన్సువాడ, దామర్‌గిద్దా, ముబారక్‌పూర్, నల్లవాగు, నారాయణఖేడ్‌కు వెళ్లే వాహనదారులు దుర్వాసన భరించలేక ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. సమస్యను పరిష్కరించాలని రెండు నెలలుగా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు.

పేదలకు ఆసరాగా ‘ఉపాధి హామీ’

- పెరిగిన జాబ్‌కార్డుల సంఖ్య
- ఊపందుకున్న ఉపాధిహామీ పనులు
- రూ.8కోట్ల అంచనాతో చేపట్టిన పనులు

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ఆసరాగా నిలుస్తోంది. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లకుండా ఆదుకుంటోంది. అడిగిందే తడువుగా అధికారులు కూలీలకు జాబ్‌కార్డులను జారీ చేస్తూ పని కల్పిస్తున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో ఉపాధిహామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఉపాధి పనులు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలకు అధికారులు జాబ్‌కార్డులు అందజేస్తూ పనులు కల్పిస్తున్నారు.

– జహీరాబాద్ టౌన్



అర్జున్‌నాయక్ తండాలో కందకాల పనులు చేస్తున్న కూలీలు

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో రెండు నెలల నుంచి పెద్ద ఎత్తున ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. మొగుడంపల్లి మండలంలో గత సంవత్సరంలో 10527 జాబ్‌కార్డులు ఉండగా ఈ సంవత్సరం 11734 పెరిగాయి. జహీరాబాద్ మండలంలో గత సంవత్సరం 10,375 జాబ్‌కార్డులు ఉండగా 2023–234 సంవత్సరానికి 11,123కు పెరిగాయి. మొగుడంపల్లి మండలంలో రోజువారీగా 3899 మంది కూలీలు పనిచేస్తున్నారు. జహీరాబాద్ మండలంలో 3400 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ సంవత్సరం నిరవధిక కందకాలు, మళ్లింపు కాలువలు, గుంటల ఫార్మెషన్ రోడ్డులు, చెరువుల్లో పూడికతీత, ఫీడర్ ఛానల్, చెడ్‌డ్యాంల్లో పూడికతీత, నర్సరీల్లో మొక్కల పెంపకం, వ్యక్తిగతంగా హార్టికల్చర్ పనులను ఉపాధిహామీ ద్వారా చేపడుతున్నారు.



కొత్తూర్(బి) గ్రామంలో చేపట్టిన కాలువ పనులు

రూ.8 కోట్ల అంచనాతో పనులు

జహీరాబాద్, మొగుడంపల్లి మండలంలో రూ.8కోట్ల అంచనాలతో ఉపాధి పనులు చేపడుతున్నారు. మొగుడంపల్లి మండలంలో గత సంవత్సరం 12 నెలల్లో 11.29 కోట్ల పనులు చేపట్టగా ఈ సంవత్సరం రెండు నెలల్లో రూ.2.81కోట్లతో పనులు చేపట్టారు. ఇంకా 9 నెలల పాటు పనులు జరగాల్సి ఉంది. జహీరాబాద్ మండలంలో గత సంవత్సరం 8.82 కోట్లు పనులు చేపట్టగా ఈ ఏడాది రెండు నెలల్లో రూ.1.92 కోట్లతో పనులు చేపట్టారు. ఇలా ఉంటే కూలీరేటు గిట్టుబాటు కావడంలేదని, ఒక్కొక్కరికి ఒక్కో రకంగా కూలి డబ్బులు ఇస్తున్నారని, ఆరోపిస్తున్నారు.

జాబ్‌కార్డులు అందజేస్తున్నాం



జాబ్‌కార్డు లేని కుటుంబాలు దరఖాస్తు చేసుకుంటే వెంటనే కార్డులను జారీ చేస్తున్నాం. ఆధార్‌కార్డుతో పాటు బ్యాంక్ పట్టా పాస్ ఖాతా జిరాక్స్ అందజేస్తే రెండు, మూడు రోజుల్లోనే జాబ్‌కార్డులు అందజేస్తున్నాం. రెండు నెలల్లో ఆశించిన మేరకు పనులు జరిగాయి. కూలిరేటు తక్కువగా ఇస్తున్నారని అల్గోల్ గ్రామ కూలీలు చేస్తున్న ఆరోపణలో నిజం లేదు. నిబంధనల మేరకు కూలీ డబ్బులను ఇస్తున్నాం. కూలీల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకుంటున్నాం.

– అశోక్‌కుమార్, ఏపీఎం, జహీరాబాద్

గ్రంథాలయాల్లో సదుపాయాలు

ఎమ్మెల్యే సంజీవరెడ్డి హామీ

నారాయణఖేడ్: నియోజకవర్గంలోని గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. పాఠకులకు సూచించారు. ఎమ్మెల్యే జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఏర్పాటు చేసిన సన్మాన సభలో పాఠకుల తరపున లైబ్రేరియన్ లలిత ఆధ్వర్యంలో సంజీవరెడ్డిని ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే ఖేడ్ గ్రంథాలయంలో చల్లటి తాగునీరు, ఏసీ, తదితర సదుపాయాలు కల్పించామన్నారు. అభ్యర్థులు బాగా చదువుకొని అత్యధిక ఉద్యోగాలు సాధించి ఖేడ్‌ను నెంబర్‌వన్‌గా నిలుపాలని ఆకాంక్షించారు. మంగళవారం తన జన్మదినం సందర్భంగా తనను ఆశీర్వదించిన నియోజకవర్గవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ దారం శంకర్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, మాజీ ఎంపీటీసీలు పండరిరెడ్డి, ముంతాజ్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న లైబ్రేరియన్, పాఠకులు

పల్లె ప్రకృతి వనాలు శుభ్రం

మొక్కలను సంరక్షించాలని అధికారులకు డీఆర్‌డీఓ పీడీ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని ఆయా గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు అధ్వాన్నంగా మారటంతో ‘నిర్వహణ నాస్తి’ పేరిట మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి డీఆర్‌డీఓ పీడీ జ్యోతి స్పందించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో అధ్వాన్నంగా మారిన పల్లె ప్రకృతి వనాల్లో పరిశుభ్రతతో పాటు మొక్కల రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పంచాయతీల అధికారులను డీఆర్‌డీఓ పీడీ ఆదేశించారు. దీంతో బుధవారం ఆయా గ్రామ పంచాయతీల అధికారులు గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాల్లో మొక్కల రక్షణకు చర్యలు చేపట్టారు. ఖాజీపల్లిలో ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, కొర్లకుంట, నల్తూర్ గ్రామాల్లో ఈఓ రానాకుమార్‌తో పాటు ఆయా గ్రామాల ఈఓల ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఎండిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.



ఖాజీపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో మొక్కకు నీరు పడుతున్న సిబ్బంది

జాతరకు ఆలయం ముస్తాబు

నారాయణఖేడ్: ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన మనూరు మండల పరిధిలోని బోరంచ నల్లపోచమ్మ ఏడువారాల జాతర సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. జిల్లాతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలి రానున్న సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి వచ్చేనెల 27 వరకు జాతర కొనసాగనున్న సందర్భంగా బుధవారం గణపతి పూజ, ధ్వజారోహణం, స్వస్తి పుణ్యావచనం నిర్వహించారు. జాతర ఉత్సవాల మొదటి రోజు గురువారం నుంచి అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు, విశేష పూజలు నిర్వహించనున్నారు. ఏడో గురువారం పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



బోరంచ నల్లపోచమ్మ ఆలయం

18న వాసవీ మాత జయంతి

సంగారెడ్డి టౌన్: ఈ నెల 18న వాసవీ మాత జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు వాసవీ మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కృష్ణ తెలిపారు. ఈ మేరకు సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న ఉదయం 9గంటలకు ప్రభుత్వ అతిథి గృహం నుంచి వాసవీ మాత దేవాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు రాజు, కృష్ణమూర్తి, విద్యాసాగర్, సభ్యులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన



మాట్లాడుతున్న తహసీల్దార్ గంగాభవాని

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ గంగాభవాని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యంను సేకరిస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శోభాయాత్ర



కోలాటం ఆడుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్: లక్ష్మీనారాయణస్వామి శోభాయాత్రను సంగారెడ్డి పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయం వద్ద ప్రధాన అర్చకులు వరదాచార్యులు రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడుతూ ముందుకు సాగారు. కొండాపూర్ మండల పరిధిలోని మారేపల్లి గ్రామం వరకు రథయాత్ర కొనసాగింది.

బీటీ-3 పత్తి విత్తనాలు విక్రయించొద్దు



మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

రాయికోడ్(అందోల్): పత్తి విత్తనాల్లో బీటీ–3 విత్తనాలను విక్రయించొద్దని రాయికోడ్ సహాయ వ్యవసాయ సంచాలకుడు సత్యనారాయణ అన్నారు. రాయికోడ్‌లోని రైతువేదికలో ఏఓ అభినాష్‌వర్మతో కలిసి మండల పరిధిలోని ఫర్టిలైజర్ డీలర్లతో కలిసి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్‌కార్డు ద్వారానే ఎరువులను విక్రయించాలని సూచించారు. ఎంఆర్‌పీ ధరలకే పత్తి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను విక్రయించాలన్నారు. డీలర్లు తమ లైసెన్స్‌లను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ అవసరమైన సేవలను అందించాలని తెలిపారు.

మెగా లోక్‌అదాలత్‌పై ప్రచారం

నారాయణఖేడ్: ఖేడ్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో వచ్చే నెల 8న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌కు సంబంధించి బుధవారం ఖేడ్ కోర్టు ఆవరణలో స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెగా లోక్‌అదాలత్‌లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోదగ్గ కేసులకు సంబంధించిన వివరాలతో ముద్రించిన కరపత్రాలను కోర్టు వాయిదాలకు వచ్చిన కక్షిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శి లక్ష్మణరావు, సీనియర్ న్యాయవాదులు భోజిరెడ్డి, చంద్రశేఖర్‌రావు, నర్సింగ్‌రావు, సంగమేశ్వర్‌రెడ్డి, కోర్టు సిబ్బంది సంజీవులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న న్యాయవాదులు

సబ్ సెంటర్ల భవనాలు పూర్తయ్యేనా?

- ఒక్కో భవనానికి రూ.20లక్షల నిధులు మంజూరు
- ఏడాది గడుస్తున్నా పూర్తికాని హెల్త్ సబ్‌సెంటర్లు
- పట్టించుకోని అధికారులు

గ్రామీణ ప్రాంతాల పేదలకు వైద్యం అందించేందుకు గత ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య సబ్‌సెంటర్ భవనాలను నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. హత్నూర మండల పరిధిలో 8 ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ల భవనాల నిర్మాణం కోసం ఏడాది క్రితం ఒక్కో భవనానికి రూ.20లక్షల చొప్పున నిధులు విడుదల చేయగా కొన్ని భవనాలను నిర్మించేందుకు టెండర్లు పిలిచారు. దీంతో కొంతమేరకు పనులను చేపట్టగా మరికొన్ని భవన నిర్మాణాలకు కనీసం పనులు కూడా ప్రారంభించలేదు. దీంతో గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను ప్రస్తుత ప్రభుత్వం విడుదల చేస్తుందా లేదా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

– హత్నూర(సంగారెడ్డి)



అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై దృష్టి పెట్టేలా గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్లను నిర్మించాలన్న ఆలోచనతో గత ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కానీ.. ఏడాది గడుస్తున్నా భవన నిర్మాణాలు నేటికీ పూర్తికాలేదు. మండల కేంద్రమైన హత్నూరలో భవన నిర్మాణం ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకూ పనులను పూర్తి చేయలేదు. అదేవిధంగా ఐటీ కాలనీకి మంజూరైన భవన నిర్మాణ పనులు కనీసం ప్రారంభించలేదు. మండలంలోని చింతల్‌చెరు, బోరపట్ల, దౌల్తాబాద్, సిరిపుర, గ్రామాలకు ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల భవనాలను గత ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ.. ఇప్పటివరకూ భవన నిర్మాణాలను పూర్తి చేయకపోవడంతో పాలకుల తీరుపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య సబ్‌సెంటర్ భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలను పూర్తి చేస్తాం

ప్రాథమిక వైద్య ఉపకేంద్రాల్లో నిర్మిస్తున్న సబ్‌సెంటర్ల భవనాలు త్వరగా పూర్తయ్యేవిధంగా చర్యలు తీసుకుంటాం. ఎలక్షన్ కోడ్‌ల వల్ల కొన్నింటికి టెండర్లు రాలేదు. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే అన్ని భవన నిర్మాణాలను పూర్తిచేస్తాం.

బగలాముఖి ఆవిర్భావ వేడుకలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖి అమ్మవారి ఆవిర్భావాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం వేద పండితుడు గంగవరం ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పూర్ణకుంభజలంతో బగలా అష్టోత్తర శతనామ మంత్రం, హరిద్రార్చిన, పీతాంబరా, బగలాముఖీ పూర్ణకలశపూజ, పూర్ణకుంభ హరిద్రార్చిత, స్వర్ణజల అభిషేకం మహోత్సవం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బగలాముఖి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ, నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్, సూర్యకుమార్‌గౌడ్, వెంకటేష్‌తో పాటు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో బగలాముఖి అమ్మవారు